**డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 572 మంది పట్టివేత**



మిగతా 3లో..


# బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ సోమవారం, 27 జూలై-2026 balagamtv100@gmail.com పేజీలు-8


**ఎంపీ vs ఎమ్మెల్యే..**

**చామల అనుచరుడిపై మందుల సామేల్ వర్గం హత్యాయత్నం..!**



మిగతా 3లో..

# కేవలం నినాదాలతో దేశం అభివృద్ధి చెందదు

- ప్రతిపక్షాలు, ప్రజల మాటను వినాలి
- అలా చేయకనే 56 అంగుళాల ఛాతీ
- యువత ముందు తలవంచాల్సి వచ్చింది
- జాతీయ మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్

హైదరాబాద్, జూలై 26: దేశంలో అసెంబ్లీలు, లోక్‌సభకు పోటీచేసే కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించాలని.. ప్రస్తుత మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులోనే ఈ అంశాన్నీ చేర్చాలని ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. ఇప్పుడు 21 ఏళ్ల యువత ఐఏఎస్, ఐపీఎస్‌లు అవుతున్నారని, పెద్ద కంపెనీలనూ నడుపుతున్నారని గుర్తు చేశారు. వారికి రాజకీయాల్లో ఎందుకు అవకాశం ఇవ్వకూడదని ప్రశ్నించారు. ఈ అంశంపై రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు, పునర్విభజన, పోటీ వయసు 21 ఏళ్లకు తగ్గించడం.. ఈ నాలుగు అంశాలనూ ఒకే బిల్లులో చేర్చి పార్లమెంటులో సమగ్ర చర్చ చేపట్టాలని ప్రధాని మోదీని కోరారు. లేదా సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసి, ఈ అంశాలపై అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలని.. నిపుణులు, సంబంధిత వర్గాలతోనూ చర్చించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జాతీయ మీడియాతో



మాట్లాడారు. దేశంలోని యువశక్తి ముందు 56 అంగుళాల ఛాతీ కూడా తలవంచాల్సి వచ్చిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఐదేళ్ల క్రితం రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన మూడు నల్లచట్టాలను ప్రతిపక్షాలు తప్పుబట్టినా మోదీ మిగతా 3లో..

# క్షిపణుల కొరత ఆగిన దాడులు

- ప్రభుత్వ సలహాదారుల హెచ్చరికలతో తగ్గిన ట్రంప్
- ఆదివారం నిలిచిపోయిన అమెరికా, ఇరాన్ దాడులు
- హోర్ముజ్‌లో సీమైన్ తగిలి పేలిపోయిన ట్యాంకర్!
- సౌదీ ఆరామ్‌కో రిఫైనరీపై హౌతీల దాడి



వాషింగ్టన్/దుబాయ్, జూలై 26: ఇరాన్‌పై దాడులు మరింత పెంచుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ప్రకటించారు. ఊహించనంత భారీగా దాడులు ఉంటాయనీ చెప్పారు. కానీ అందుకు విరుద్ధంగా ఇరాన్‌పై దాడుల తీవ్రత తగ్గుతూ వచ్చింది. ఆదివారం అసలు ఎలాంటి దాడులూ చేయలేదు. అమెరికాకు క్షిపణుల కొరత తలెత్తుతుండటం, దౌత్య చర్యల్లో పురోగతి, యుద్ధం మరింత విస్తరించే ప్రమాదం ఉందని రక్షణశాఖ ఉన్నతాధికారులు, సలహాదారులు హెచ్చరించడమే దీనికి కారణమని అమెరికా మీడియా వెల్లడించింది. అమెరికా ఎంతగా దాడులు చేస్తున్నా ఇరాన్ ఏమాత్రం వెనక్కితగ్గడం లేదు.. పైగా చవకైన డ్రోన్లు, క్షిపణులతో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై విరుచుకుపడుతోంది. వాటిని అడ్డుకోవడానికి అమెరికా పేట్రియాట్, థాడ్ వంటి చాలా ఖరీదైన ఇంటర్‌సెప్టార్ క్షిపణులు వాడుతోంది. ఇది సుదీర్ఘంగా కొనసాగుతుండటంతో అమెరికా వద్ద క్షిపణుల నిల్వలు మిగతా 3లో..

# 74వ సారి ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 26 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 74వ సారి ఢిల్లీ పర్యటనకు వెళు న్నారు. సోమవారం ఢిల్లీలో ఖర్గే అధ్యక్షతన జరిగే ఏఐసీసీ సమావేశంలో పాల్గొనను న్నారు. 'సర్' ప్రక్రియ, పార్టీ వ్యవహారాలతో పాటు ఇటీవల ఢిల్లీ విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టే కార్యాచరణపై చర్చించే అవకాశాలు న్నట్టు సమాచారం.



సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరామర్శిం చారు. ఇటీవల సినిమా షూటింగ్‌లో గాయపడి హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో బాలకృష్ణ చికిత్స పొందుతున్నారు. సీఎం చంద్రబాబు ఆదివారం ఏఐజీ ఆసుపత్రికి వెళ్లి బాలకృష్ణను పరామర్శించారు.

హైదరాబాద్, జూలై 26:

# విద్యార్థులు కణకణమండే అగ్గిరవ్వలు..



- వారిని రెచ్చగొట్టవద్దు.. బీజేపీ నాయకులకు దాసోజు హితవు

హైదరాబాద్, జూలై 26 : గతంలో ఎన్నడూ లేని విధంగా ఢిల్లీలో విద్యార్థి ఉద్యమం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తెలిపారు. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థి, యువజన విప్లవ జ్వాలను చూశామని అన్నారు. విద్యార్థి ఉద్యమ జ్వాలలు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సునామీలా పాకిందని అన్నారు. విద్యార్థులంతా ఏకం కావడంతో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయక తప్పలేదని తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడుతూ.. నీట్ లీకేజీపై విద్యార్థులు పోరాటం చేస్తే బురదజల్లే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో ఉద్యమకారులపై బీజేపీ నేతలు అవకాలు, చవాకులు పేలారని విమర్శించారు. వారిని దేశద్రోహులు అని.. బంగ్లాదేశ్, పాకిస్థాన్ ఫండింగ్ చేస్తోందని చిల్లరగా మాట్లాడారని అన్నారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని, నీట్ పేపర్ లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు పోరాడారని మిగతా 3లో..

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సైబర్ మోసాలు


**నగరవాసులు అప్రమత్తంగా ఉండాలన్న సీపీ సజ్జనార్**

హైదరాబాద్, జూలై 26: హైదరాబాద్‌లో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ ఇళ్ల కేటాయింపు పేరిట సైబర్ మోసాలు జరిగే అవకాశముందని, ప్రజలంతా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. లబ్ధిదారుల నుంచి రూ.10వేలు ముందస్తు డిపాజిట్ చెల్లించే ప్రక్రియ ప్రారంభం కావడంతో సైబర్ నేరగాళ్లు నకిలీ కాల్స్, అపరిచిత లింక్స్‌తో బురిడీ కొట్టించే ప్రమాదముందని ఆయన తెలిపారు. ఈ పథకంలో ఎలాంటి దళారులు లేదా మధ్యవర్తులకు అవకాశం



లేదని, ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందన్నారు. నిబంధనల ప్రకారం చెల్లించిన ఈఎండీ సొమ్ము భద్రంగా ఉంటుందని, ఒకవేళ ఇల్లు కేటాయించకపోతే ఆ మొత్తాన్ని దరఖాస్తుదారుడి బ్యాంకు ఖాతాకే ప్రభుత్వం నేరుగా జమచేస్తుందని మిగతా 3లో..


# తెలంగాణాలో మూడు రోజుల పాటు వర్షాలు..



- నేడు ఈ జిల్లాలలో వరుణ కటాక్షం!
- నేడు హైదరాబాద్.. జిల్లాలలో వర్షాలు
- అన్ని జిల్లాలలో బలమైన ఉపరితల ఈదురుగాలులు
- రైతులకు సూచన

మిగతా 3లో..

# ఉక్రెయిన్, ఒడెశా పోర్టులో వాణిజ్య నౌకపై దాడి..



- ఇద్దరు భారతీయులు గల్లంతు.. ఇద్దరు సురక్షితం

న్యూఢిల్లీ,జూలై 26 : నలుగురు భారతీయులతో వెళ్తున్న వాణిజ్య నౌకపై ఉక్రెయిన్‌లోని ఒడెశా పోర్టు వద్ద దాడి జరిగింది. ఈ దాడిలో ఇద్దరు సిబ్బంది సురక్షితంగా ఉండగా, మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు కీవ్‌లోని భారతీయ రాయబార కార్యాలయం తెలిపింది. శనివారం ఈ దాడి జరిగినట్లు వెల్లడించింది. గల్లంతైన ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని రాయబార కార్యాలయం ఆదివారం వివరించింది.ఎంవీ ఏజీఎన్ రంగార్ అనే వాణిజ్య నౌక నల్లసముద్రంలోని ఒడెశా పోర్టులో నిలిచి ఉంచిన సమయంలో ఈ దాడి జరిగినట్లు సమాచారం. ఈ పోర్టు వాణిజ్య రవాణాకు చాలా కీలకం. రష్యా-ఉక్రెయిన్ వార్ సందర్భంగా ఈ నౌకపై, ఈ పోర్టుపై గతంలో కూడా దాడి యత్నం జరిగినట్లు తెలుస్తోంది. దాడి నేపథ్యంలో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, సంబంధిత అధికారులను సంప్రదిస్తున్నామని రాయబార కార్యాలయం తెలిపింది. దాడి సమయంలో ఇద్దరు భారతీయులు నౌకలో ఉండగా, ఇద్దరు సురక్షితంగా ఉన్నారు. మిగిలిన ఇద్దరి కోసం గాలింపు, సహాయక చర్యలు కొనసాగు తున్నాయి. అయితే, ఈ దాడి ఎవరు చేశారు.. ఎందుకు చేశారు అనే వివరాల్ని మాత్రం భారత అధికా రులు వెల్లడించలేదు. ఉక్రెయిన్ వాణిజ్యానికి నల్ల సముద్రంలోని ఒడెశా పోర్టు చాలా కీలకం. ఈ దేశానికి అత్యంత కీలకం కాబట్టి, 2022 ఫిబ్రవరిలో రష్యా యుద్ధం ప్రారంభమైనప్పటి మిగతా 3లో..

# వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను..



- అవినీతి రాజకీయాలే కారణం..
- సిద్ధరామయ్య ప్రకటన

న్యూఢిల్లీ, జూలై 26 : కర్ణాటక మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ లీడర్ సిద్ధరామయ్య కీలక ప్రకటన చేశారు. 2028లో రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించారు. తన వయసు, ఆరోగ్యంతోపాటు అవినీతి రాజకీయాలు పెరిగిపోతుండటం కారణంగా తాను 2028 ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ప్రకటించారు. మాండ్య జిల్లాలో జరిగిన ఒక కార్యక్రమంలో సిద్ధరామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు.రాజకీయ రంగం అవినీతిమయంగా మారింది. అందువల్లే నేను 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నా. అయినప్పటికీ నేను రాజకీయాల్లోనే కొనసాగుతాను. ప్రజా జీవితంలో ప్రజల కోసం పని చేస్తా. ప్రజల ఇబ్బందులపై నా గళం విప్పుతా. ప్రజల సంతోషం కోసం పనిచేస్తా. నా వరుణ నియోజకవర్గ ప్రజలు నన్ను మళ్లీ పోటీ చేయమని అడుగుతున్నారు. కానీ, మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయకూడదని

మిగతా 3లో..

# మామూళ్ల మత్తులో ట్రాఫిక్ ఎస్సైలు!




- బదిలీ అయినా రోజుల తరబడి రిలీవ్ కాని వైనం
- చిరువ్యాపారులు, హ్యాకర్స్, ఫుట్‌పాత్ వ్యాపారులపై జులుం
- ఉన్నతాధికారుల అండదండలతో నెలవారీ వసూళ్లు

హైదరాబాద్, జూలై 26: నగరంలోని ట్రాఫిక్ ఎస్సైల పనితీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతు న్నాయి. కీలక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న కొందరు దుకాణాలు, ఫుట్‌పాత్ హాకర్స్ నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు బదిలీలు జరిగినప్పటికీ రోజుల తరబడి పాత స్టేషన్లలోనే కొనసాగుతూ తమ దందాను అలాగే కొనసాగిస్తు న్నారంటూ కమిషనరేట్‌లోని సిబ్బందిలో చర్చ జరుగుతోంది. నో ఎంట్రీలు, ట్రాఫిక్ నిబంధ నలు, ఫుట్‌పాత్ ఆక్రమణల పేరుతో వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ ట్రాఫిక్ ఎస్సై లపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. కొందరు ఉన్నతాధికారుల అండ దండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలున్నాయి.

# బైక్‌ను ఢీ కొట్టిన టిప్పర్.. ఇద్దరు విద్యార్థులు మృతి





**హైదరాబాద్, జూలై 26:** టిప్పర్ ఢీకొని ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా మరో ఇంటర్ విద్యార్థికి తీవ్రగాయాలైన ఘటన కూకట్‌పల్లి పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ స్వామిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..... యూసుఫ్‌గూడకు చెందిన బేగరి మహేష్ (17), మన్నె లక్ష్మీతేజ(17), పులి కిరణ్‌కుమార్ (17) ముగ్గురూ స్నేహితులు. మహేష్, లక్ష్మీతేజ అమీర్‌పేటలోని అరోమా జూనియర్ కాలజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. పులికిరణ్ అమృత కాలజీలో చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంలో ముగ్గురూ కలసి పులి కిరణ్‌కుమార్ బైక్‌పై క్రికెట్ ఆడుకోవడం కోసం ఆదివారం ఉదయం సుమారు 4గంటల సమయంలో ఇంటి నుం చి బయటకు వెళ్లారు. ఆట ముగిసిన తరువాత కూకట్‌పల్లి మహలక్ష్మీ కేఫ్‌లో టీ తాగడానికి అదే బైక్‌పై ముగ్గురు మూసాపేట నుంచి కేపీహెచ్‌బీకాలనీ వైపు వెళుతుండగా మెట్రో ఫిల్లర్ 796 వద్దకు రాగానే టిప్పర్‌ను ఆకస్మాత్తుగా కుడి వైపు తిప్పడంతో బైక్ టిప్పర్‌కు ఎడుమవైపు తగిలింది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న పులి కిరణ్‌కు తీవ్రగాయాలు కాగా వెనుక కూర్చున్న మహేష్, లక్ష్మీతేజ టిప్పర్ లారీ వెనుక చక్రాల కింద పడడంతో ఇద్ద రు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు పులి కిరణ్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమా ర్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# హాలిడే ప్యాకేజీల పేరుతో ఘరానా మోసం





## 15 మంది అరెస్టు

## రూ. 22 లక్షల మేర చీటింగ్

**హైదరాబాద్, జూలై 26:** హాలిడే మెంబర్‌షిప్‌లు, టూర్ ప్యాకేజీల పేరుతో ప్రజలను మోసగిస్తున్న ముఠాపై పోలీసులు కొరడా ఝులిపించారు. ది పసిఫిక్ హాలిడే వరల్డ్ (4ఆర్ సీజన్స్ హాలిడేస్ ప్రైవేట్ లిమిటెడ్, న్యూఢిల్లీ యూనిట్)సంస్థకు చెందిన 15 మంది కన్సల్టెంట్లు, నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేశారు. సుమారు రూ.22 లక్షలను వారు మోసపూరితంగా వసూలు చేసినట్లు తేలింది. శనివారం గచ్చిబౌలిలోని శేరిలింగంపల్లి జోన్ డీసీపీ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ ఉదయ్‌రెడ్డి, ఏసీపీ రమణగౌడ్, ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాలను వెల్లడించారు. న్యూఢిల్లీకి చెందిన రాజేశ్‌కుమార్, మహమ్మద్ రిహాన్ అక్తర్, అబ్దుల్ రషీద్, రామ్‌షింగ్ ధామీలు 4ఆర్ సీజన్స్ హాలిడేస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నకిలీ టూర్స్ అండ్ ట్రావె ల్స్ సంస్థను నిర్వహిస్తున్నారు. ది పసిఫిక్ హాలిడే వరల్డ్ పేరుతో తమ కంపెనీకి చెందిన మార్కెటింగ్ సిబ్బందిని ఇటీవల హైదరాబాద్‌కు పంపించారు. 15 మంది సిబ్బంది నగరంలోని వేర్వేరు షాపింగ్‌మాల్స్, కమర్షియల్ సెంటర్లకు వెళ్లి అక్కడికి వచ్చే ప్రజలకు ఉచిత కూపన్లు, గిఫ్ట్ ఓచర్లు అందిస్తామని వారి ఫోన్ నంబర్లు సేకరించేవారు. అనంతరం వారికి ఫోన్లు చేసి నగరంలోని స్టార్ హోటళ్లకు ఆహ్వానించి హాలిడే మెంబర్‌షిప్‌లపై ఆకర్షణీ యమైన ఆఫర్లు చూపి భారీ మొత్తాలు చెల్లించేలా ప్రలోభ పెట్టేవారు. రూ.1.25 లక్షలు చెల్లిస్తే 5 ఏళ్ల పాటు ప్రతి ఏడాది దేశంలో ఎక్కడైనా 7 రాత్రుల ఉచిత బస, 10 సంవత్సరాల మెంబర్‌షిప్ తీసుకుంటే విదేశాల్లోనూ 7 రాత్రుల బస కల్పిస్తామని హామీలు ఇచ్చి సభ్యత్వాలు విక్రయించారు. ఈనెల 24న బాధితుడు వుట్టూరి స్వరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈనెల 16న గచ్చిబౌలిలోని గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆ సంస్థ ప్రతినిధుల మాటలు నమ్మి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు క్రెడిట్ కార్డు ద్వారా రూ.3.40 లక్షలు చెల్లించినట్లు స్వరాజ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. డబ్బు తీసుకున్న తరువాత వాగ్దానం చేసిన సేవలను అందించకపోవడంతోపాటు ఫోన్ కాల్స్, సందేశాలకు కూడా స్పందించ డం మానేశారని బాధితుడు తెలిపాడు. ప్రాథమిక దర్యాప్తులో నిందితులు 4ఆర్ సీజన్స్ హాలిడేస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ది పసిఫిక్ హాలిడే వరల్డ్ సంస్థలో హాలిడే కన్సల్టెంట్లు, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లుగా పనిచేస్తూ గచ్చిబౌలిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. పసిఫిక్ హాలిడే వరల్డ్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, హాలిడే కన్సల్టెంట్లుగా పనిచేస్తున్న మొత్తం 15 మంది మార్కెటింగ్ సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరంతా కలిసి 19 మందిని మోసం చేసి వారి నుంచి రూ.22 లక్షలు వసూలు చేసిన ట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇదే కంపెనీ ప్రతినిధులు గతంలో విజయవాడలోనూ ఇదే తరహా మోసాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు నిందితులందరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు కంపెనీ ప్రధాన నిర్వాహకుల కోసం గాలిస్తున్నట్లు అడిషనల్ డీసీపీ ఉదయ్‌రెడ్డి తెలిపారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 572 మంది పట్టివేత



**హైదరాబాద్, జూలై 26:** రోడ్డు భద్రతను పటిష్టం చేయడమే లక్ష్యంగా హైదరాబాద్ నగరంలో మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న వాహనదారులపై సిటీ ట్రాఫిక్ పోలీసులు కఠినచర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జూలై 24,25 తేదీలలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్‌ను నిర్వహించారు. నగరవ్యాప్తంగా చేపట్టిన ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 572 మంది వాహనదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుబడినవారిలో 475 మంది ద్విచక్రవాహనదారులు , 43 మంది ఆటోరిక్షాలు , 54 మంది కార్లు, ఇతర భారీ వాహనాలు నడుపుతున్నవారు ఉన్నారని తెలిపారు.

### సైబరాబాద్‌లో 327 మందిపై కేసులు..!

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ జీ. నరేందర్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా 327 మందిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. 255 మంది ద్విచక్ర వాహనదారులు, 13 ఆటోలు, 55 కార్ల యజమానులు, 4 భారీవాహనదారులపై కేసులు నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు.

# మానాలలో ఎల్‌నినో పై అవగాహన సదస్సు..

**బలగం టీవీ, రుద్రంగి :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఓ (చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్) ü మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, రుద్రంగి మండల వ్యవసాయ శాఖ అధికారి సాయి కిరణ్ పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే పరిస్థితి కనిపించడం లేదని, మేఘాలు వచ్చినప్పటికీ తగినంత వర్షం కురవక భూగర్భ జలాలు తగ్గే అవకాశముందని వివరించారు. ఈ నేపథ్యంలో అధిక నీటి అవసరం ఉన్న వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పేసర్లు, కందులు, మక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. పంటల మార్పిడి విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని, మినుములు, శనగలు వంటి పప్పుధాన్యాల సాగు భూమి సారాన్ని పెంచుతుందని తెలిపారు. వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా బోరు ప్రాంతాల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, రైతులు నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్, ఖర్జూరం వంటి దీర్ఘకాలిక ఆదాయాన్నిచ్చే పంటల సాగుపై ప్రభుత్వం సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందిస్తున్నందున రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే అవసరమైన రైతులకు కంది, పెసర విత్తనాలు



అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టి, నీటి వనరులను సంరక్షిస్తూ పంటల ఎంపిక చేసుకుంటే నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని అధికారులు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో జ్యోతి, సెక్రెటరీ అనిల్, గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్, ఉప సర్పంచ్ దాసరి అశోక్, సొసైటీ సీఈవో రాజారాం, జక్కు మోహన్, జక్కు లింగారెడ్డి, జక్కుల లక్ష్మీ నర్సయ్య, జక్కు వంశీ, కారోబర్ తిరుపతి గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువశక్తి సాధించిన మహా విజయం..

## కాముని వనిత నలినీకాంత్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత నలినీకాంత్ మాట్లాడుతూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువశక్తి సాధించిన మహా విజయమని పేర్కొన్నారు. ఈ విజయం దేశవ్యాప్తంగా మహిళలు, యువత చేపట్టే ప్రజాస్వామ్య పోరాటాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆమె అన్నారు. అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన బీజేపీ కూటమి ప్రభుత్వ పతనానికి ఇదే నాంది అని ఆమె విమర్శించారు. అధికార అహంకారంతో దేశ విద్యా వ్యవస్థతో పాటు వివిధ ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేస్తూ, యువత ఆకాంక్షలను అణచివేయాలని ప్రయత్నించిన ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని ఆమె ఆరోపించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో దేశ యువత పోరాటం ముగిసిపోదని, ప్రజల ఆకాం క్షలకు విరుద్ధంగా వ్యవహరించే కేంద్ర ప్రభుత్వంపై పోరాటం మరింత ఉధృతమవుతుందని కాముని వనిత నలినీకాంత్ అన్నారు. రాబోయే రోజుల్లో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులు కూడా ప్రజల తీర్పుకు తలవంచాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ పోరాటంలో యువతకు అండగా నిలిచి, లాఠీ దెబ్బలను ఎదు ర్కొంటూ, అక్రమ అరెస్టులను సైతం లెక్కచేయ కుండా ప్రజా స్వామ్య పరిరక్షణ కోసం పోరాడిన కాంగ్రెస్ అగ్రనేతలు శ్రీ రాహుల్ గాంధీ, శ్రీమతి ప్రియాంక గాంధీ వాద్రా చూపిన పోరాట స్ఫూర్తి తమకు ఆదర్శమని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ధైర్యంగా పోరాడి విజయాన్ని సాధించిన దేశ యువతకు కాముని వనిత నలినీకాంత్ అభినందనలు తెలిపారు. యువత ఐక్యత, ప్రజాస్వామ్యంపై నమ్మకం దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని ఆమె పేర్కొన్నారు.

# జిల్లా కలెక్టర్ వ్యక్తిగత వేధింపులు కక్ష సాధింపు చర్యలు ఖండించండి



- **రాజ్యాంగ విలువలనుక పాటించాలి..**
- **సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి**

**బలగం టీవీ, జనగామ:** ప్రజలు పోరాడి సాధించుకున్న జనగామ జిల్లాకు కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న సందీప్ కుమార్ ఝా ప్రతిపక్ష పార్టీల నాయకులు వారి నియంతృత్వ వైఖరులను ప్రశ్నించినందుకు వ్యక్తిగత కక్ష సాధింపులు చేస్తున్న విధానాలను మానుకొని రాజ్యాంగ ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి జిల్లాలో పరిపాలన కొనసాగించాలని సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి విలేకరుల సమావేశంలో అన్నారు. శనివారం రోజు సిపిఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కలెక్టర్ కార్యాలయం గేటు బయట ప్రజల వాహనాలను బండ్లను ఆపి లోపటికి నడిచి రావాలని గతంలో మాదిరిగా పార్కింగ్ కు అవకాశం లేదని అంటే ప్రజలను ఇబ్బందికి గురి చేస్తున్న పార్కింగ్ అంశంపై ప్రశ్నించినందుకు అలాగే దళిత,బీసీ మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన ఉపాధి రోడ్డున పడ్డ సందర్భంలో ఆవిషయం అడిగినందుకు వీటితో పాటు జిల్లాలో ఇండ్ల నిర్మాణం ప్రజల ఇతర అవసరాల కోసం ఇసుక మట్టి తరలింపులో ఆంక్షలు ఇబ్బందులు పెడుతున్న సందర్భంలో ట్రాక్టర్ యజమానులు జెసిబి యజమానులు వీటిపై ఆధారపడి పని చేస్తున్న కార్మికులు డ్రైవర్లు ఉపాధి లేక రోడ్డున పడుతున్నారని వారి వాహనాల రుణ వాయిదాలు కట్టుకోలేని పరిస్థితులు ఏర్పడుతున్నా యని అడిగినందుకు మీరు నన్ను అడుగుతారా... ప్రశ్నిస్తారా...అనే భావనతో జిల్లాకు అన్నిటికీ నేనే బాసును నన్ను ప్రశ్నిస్తారా... అనేటువంటి ధోరణితో అడిగిన సిపిఎం నాయకుల పై కక్షలు పెంచుకొని వారి రిప్రజెంటేషన్ లకు సమయం ఇవ్వకుండా మెమోరాండాలు తీసుకోకుండా కలవడం కోసం వచ్చిన సందర్భంలో తేలిక భావంతో అవహేళన చేస్తూ మాట్లాడిన పద్ధతి సరిగా లేదన్నారు. కేసులు పెడతాం అని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. సిపిఎం పార్టీకి కమ్యూనిస్టులకు కేసులు జైలు కొత్తేమీ కాదని వివరించారు. జిల్లా పరిపాలన అధికారిగా ఉండి రాజకీయ నాయకుల లెక్క బెదిరింపు ధోరణితో వివరించడం సరియైన పద్ధతి కాదుఅన్నారు. జనగామ పట్టణంలోని మల్లన్న గుడి వద్ద సర్వే నెంబర్ 401లో 20 సంవత్స రాల క్రితం ప్లాట్లు కొనుగోలు చేసిన కొనుగోలుదారులు వారి సమస్య పరిష్కారం కోసం సిపిఎం పార్టీ వద్దకు వస్తే వారికి సహకరించే ప్రయత్నం జరుగుతుంది. ఈ క్రమంలో అల్లాడి మోహన్ రావు, అల్లాడి ఈశ్వరరావు, నిమ్మతి శ్రీనివాస రెడ్డి ఇద్దరి భూముల మధ్యలో సర్వేనెంబర్ బార్డర్ సమస్య ఉంది. ఈ సమస్య విషయంలో ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదరక ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇబ్బంది పడుతున్నారు. ఇంకా సమస్య పరిష్కార దిశగా ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి ని వ్యక్తిగతంగా బదనం చేయడం కోసం మంగా సిద్ధిరాములు అనే వ్యక్తి ఈభూమిలో ప్లాట్ల సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు 25-30 మంది మాత్రమే ఉంటే 150 మంది ఉన్నారని ఒక్కొక్కరి వద్ద పదివేల రూపాయలు వసూలు చేశారని తప్పుడు ఫిర్యాదు కొందరి ప్రోత్బలంతో ఫిర్యాదు చేస్తే దీన్ని ఆసరా చేసుకుని కలెక్టర్ జిల్లా పౌర సంబంధాల అధికారి గారిచే పత్రికా ప్రకటన చేయించడం సరైన కాదని అన్నారు. ఈ విషయం కోసం న్యాయపోరాటం చేయడానికి అయినా సిద్ధమని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, జోగు ప్రకాష్, సుంచు విజేందర్, భూక్యా చందు నాయక్, పల్లెర్ల లలిత, తదితరులు పాల్గొన్నారు.

# కూర్మ సంఘం ఆధ్వర్యంలో పస్కా బీరయ్యకు బోనాలు



**బలగం టీవీ, రుద్రంగి :** రుద్రంగి మండలం మానాల గ్రామంలో తొలి ఏకాదశి సందర్భంగా కూర్మ సంఘం ఆధ్వర్యంలో పస్కా బీరయ్యకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా మహిళలు బోనాలు తీసుకువచ్చి మొక్కులు చెల్లించగా, సంఘ సభ్యులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ఆడి పంటలు పుష్కలంగా పండాలని, గ్రామంలో సుభిక్షం నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కూర్మ సంఘం సభ్యులు, మహిళలు యువకులు పాల్గొన్నారు.

# ప్రైవేటు బస్సులపై రవాణా శాఖ కొరడా

- **31 కేసులు నమోదు చేసి రూ.1,19,600 జరిమానా విధింపు**

**ఏలూరు,జులై25 :** జిల్లాలో ప్రైవేటు బస్సులపై రవాణా శాఖ కొరడా ఝులిపించింది. కలపర్రు టోల్‌గేట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 31 కేసులు నమోదు చేసి రూ.1,19,600 జరిమానా విధించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 593 కేసుల్లో రూ.40.27 లక్షల జరిమానాలు వసూలు చేశారు. వీకెండ్ లో రద్దీగా తిరిగే కాంట్రాక్ట్ క్యేరేజీ వాహనాలపై ఏపీ ప్రభుత్వం దృష్టి సారించింది. అనుమతులు లేకుండా.. నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేటు బస్సు సంస్థలపై ఫోకస్ పెట్టింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు కలపర్రు టోల్గేట్ వద్ద వాహన తనిఖీ అధికారులు కాంట్రాక్టు క్యారేజ్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు జరిపారు. 31 కేసులు నమోదు చేసి రూ. 1,19,600ల అపరాధ రుసుము విధించినట్లు ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ శనివారం రాత్రి మీడియాకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా కమిషనరు ఆదేశాల మేరకు ప్రతి వారం కాంట్రాక్టు క్యారేజ్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్న విషయము తెలిసిందే, దీనిలో భాగముగా ఈ యేడాది జనవరి ఒకటవ తేదీ నుంచి జులై 25 వరకు 593 కేసులు నమోదు చేసి రూ. 40,27,585/- అపరాధ రుసుము విధించినట్లు డిటిసి కరీమ్ తెలిపారు.

# ఎర్రచందనం ముఠాలకు సహకరిస్తే కఠిన చర్యలు

- **అధికారులకు డిప్యూటి సిఎం పవన్ హెచ్చరికలు**

**అమరావతి,జులై25 :** ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. స్మగ్లింగ్‌ను అడ్డుకునేందుకు కఠినమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. సీడ్‌బాల్స్ పంపిణీపై అటవీశాఖ అధికారులతో శనివారం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. వెయ్యి ఎకరాల్లో డ్రోన్ల సాయంతో సీడ్ బాల్స్ విసురుతామన్నారు. అటవీ విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎర్ర చందనం అక్రమ రవాణాను ఏ విధంగా అరికడుతున్నదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని తెలిపారు. కడప జిల్లాలో రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై అధికారులతో మాట్లాడారు. ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతోపాటు వారికి సహకరిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు పవన్‌కు తెలియజేశారు.

# ధర్మేంద్రను అభినందించిన అమిత్ షా

## ప్రధాని మోడీతో తాజా పరిస్థితులపై చర్చ

**న్యూఢిల్లీ,జూలై25 :** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా.. ధర్మేంద్ర ప్రధాన్ నివాసానికి వెళ్లారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అమిత్ షా ప్రశంసించారు. దేశ విద్యా వ్యవస్థలో ధర్మేంద్ర ప్రధాన్ ఎన్నో సంస్కరణలు తెచ్చారని కొనియాడారు. విద్యాశాఖలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన కొద్దిసేపటికే భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా అత్యవసరంగా భేటీ అయ్యారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తదనంతర పరిణామాలు, దేశ రాజధానిలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, క్యాబినెట్‌లో మార్పులపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని మోదీ నివాసంలో ఈ భేటీ జరిగింది.

# (మొదటిపేజీ తరువాయి)

## క్షిపణుల కొరత ఆగిన దాడులు

తగ్గిపోయాయి. దీనితో పశ్చిమాసియాలో అమెరికా స్థావరాలు, మిత్రదేశాల భద్రతపై ప్రభావం పడుతుందని సైన్యం ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం. మరోవైపు ఇరాన్ దెబ్బకు పశ్చిమాసియాలోని జోర్డాన్, బహ్రెయిన్ తదితర దేశాల్లో ఉన్న అమెరికా స్థావరాల్లో రక్షణ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. దీనితో రక్షణ వ్యవస్థలను తప్పించుకుని మరీ ఇరాన్ క్షిపణులు అమెరికా స్థావరాల్లో విధ్వంసం సృష్టిస్తున్నాయి. యుద్ధాన్ని మరింత విస్తరించడంపై ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, సెంట్రల్ కమాండ్ చీఫ్ డాన్ కెయిన్ ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఇరాన్‌పై దాడులకు కాస్త విరామం ఇవ్వాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించారని.. భారీస్థాయిలో దాడుల కోసం సైన్యం ప్రణాళిక సిద్ధం చేసినా.. ప్రస్తుతానికి పక్కనపెట్టాలని ఆదేశించారని రక్షణ వర్గాలు తెలిపాయి. దౌత్యపరమైన చర్చలకు మార్గం సుగమం చేయాలని పేర్కొన్నారని.. అయితే ఏక్షణమైనా విరుచుకుపడటానికి సిద్ధంగా ఉండాలని కూడా సూచించారని వెల్లడించాయి.

## కేవలం నినాదాలతో దేశం అభివృద్ధి చెందదు

వినలేదని.. ఆ చట్టాలను వెనక్కి తీసుకోవడమే కాకుండా రైతులకు క్షమాపణలు కూడా చెప్పాల్సి వస్తుందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ చెప్పారని గుర్తు చేశారు. తర్వాత రైతుల పోరాటంతో మోదీ సర్కారు సాగు చట్టాలను వెనక్కి తీసుకుని, రైతులకు క్షమాపణ చెప్పాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాతైనా ప్రతిపక్షాలకు మోదీ కొంత గౌరవం ఇస్తారని, పార్లమెంట్‌లో చర్చకు అవకాశం కల్పిస్తారని భావించామని.. కానీ వారి వైఖరి మారలేదని చెప్పారు. అనేక ప్రవేశ, నియామక పరీక్షల నిర్వహణలో కేంద్రం పూర్తిగా విఫలమైందని.. ప్రతిపక్షాల సూచనలు, హెచ్చరికలను పట్టించుకోలేదని మండిపడ్డారు. పైగా ఈడీ, ఐటీ, సీబీఐ వంటి కేంద్ర సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను బెదిరించడం, ఒత్తిడి తేవడం కొనసాగించిందని మండిపడ్డారు. ఇప్పుడు దేశ యువత గల్లీ నుంచి పార్లమెంటు వరకు బలాన్ని చూపడంతో 56 అంగుళాల ఛాతీ నిలబడలేక పోయిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రతిపక్షాలు, మిత్రపక్షాల సూచనలు పట్టించుకోకుంటే యువత వీధుల్లోకి వచ్చేస్తుందని, ప్రభుత్వానికి ప్రజలు ఎదురుతిరుగుతారని మోదీ సర్కారుకు ఇప్పుడు అర్థమైందని పేర్కొన్నారు. కేవలం వికసిత్ భారత్, సబ్‌కా సాథ్‌– సబ్‌కా వికాస్ వంటి నినాదాలతోనే దేశ అభివృద్ధి జరగదని.. యువశక్తిని సరైన దిశలో నడిపించి, దేశ భవిష్యత్తును నిర్మించాలని స్పష్టం చేశారు.

## ఉక్రెయిన్, ఒడెశా పోర్టులో వాణిజ్య నౌకపై దాడి..

నుంచి ఇప్పటివరకు అనేకాసర్లు ఈ పోర్టుపై దాడి జరిగింది. మరోవైపు నల్ల సముద్రంలో ఉద్రిక్తతలు పెరగడంపై ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ కీలక ప్రకటన చేశారు. నల్ల సముద్రంలో ప్రయాణించే నౌకలపై దాడులు జరగడం ఆందోళన కలిగిస్తోంద న్నారు. ఈ ప్రాంతంలో పని చేసే భారతీయ నౌకాయాన సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితులను అంచనా వేసుకోవాలని కేంద్రం సూచించింది.

## ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సైబర్ మోసాలు

వివరించారు. డబ్బులు చెల్లిస్తే ఇల్లు ఖచ్చితంగా ఇప్పిస్తామంటూ చెప్పే వారి మాటలు నమ్మవద్దని, ఈ రోజే ఆఖరు తేదీ వెంటనే డబ్బులు కట్టకపోతే ఇల్లు రద్దవుతుందంటూ భయపెట్టి తొందరపాటులో నగదు బదిలీ చేయించుకోవడం నేరగాళ్ల ప్రధాన ఎత్తుగడగా సజ్జనార్ పేర్కొన్నారు. వాట్సాప్ లేదా మెసేజ్‌ల ద్వారా వచ్చే అపరిచిత లింకులను నమ్మి ఏపీకే ఫైళ్లను ఇన్‌స్టాల్ చేస్తే ఫోన్ హ్యాక్ అయి బ్యాంక్ ఖాతాలు ఖాళీ అవుతాయని తెలిపారు. ప్రభుత్వ పోర్టళ్లను పోలిన నకిలీ వెబ్‌సైట్లను సృష్టించే అవకాశముందని, అంతేకాకుండా మీకు గైడ్ చేస్తామంటూ ఎనీ డెస్క్, టీమ్‌వ్యూయర్ వంటి స్క్రీన్ షేరింగ్‌యాప్‌లను డౌన్‌లోడ్ చేయించి బ్యాంకు వివరాలు కాజేసే అవకాశ మున్నదని తెలిపారు. యూపీఐ పిన్ అనేది కేవలం డబ్బులు చెల్లించడానికి మాత్రమే ఉపయోగపడు తుందని, రీఫండ్ సొమ్మును స్వీకరించడానికి పిన్ నెంబర్ నొక్కాల్సిన అవసరం లేదనే విషయాన్ని లబ్దిదారులు గుర్తుంచుకోవాలన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే పోగొట్టుకున్న సొమ్మును ఫ్రీజ్ చేసేందుకు 1930 ఉచిత హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని సజ్జనార్ సూచించారు.

## విద్యార్థులు కణకణమండే అగ్గిరవ్వలు..

తెలిపారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధంగా విద్యార్థులు విజయం సాధించారని అన్నారు.విద్యార్థి ఉద్యమంపై బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు సరికావని దాసోజు శ్రవణ్ అన్నారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డికి విద్యార్థుల బాధలు అర్థంకాక నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు అనవసరమైన మాటలతో విద్యార్థులను రెచ్చగొడుతున్నారని చెప్పారు. నిరసనకారులు పాకిస్తాన్ ప్రేరేపితులని బురదజల్లే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యావ్యవస్థను సంస్కరించిందని కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారని తెలిపారు. ఆందోళనకారులకు నిరసన తెలిపే హక్కు లేదని, నిరసన తెలిపితే కాల్చిచంపాలని అన్నాడని మండిపడ్డారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డికి పరీక్ష పత్రం లీకైతే తలెత్తే సమస్యలపై అవగాహన లేదని తెలిపారు. విద్యార్థులు కాల్చివేతలకే అర్హులైతే వారితో ఎందుకు చర్చలు జరిపారని ప్రశ్నించారు. విద్యార్థులు కణకణమండే అగ్గిరవ్వలు అని.. వారిని రెచ్చగొట్టవద్దని సూచించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ స్ఫూర్తితో విద్యార్థులు పోలికేక పెట్టారని అన్నారు. సౌదీ అరేబియాలో ఇలాంటిది జరిగితే రాళ్లతో కొట్టి చంపుతారని అన్నారు.నీట్ పేపర్ లీక్‌తో దాదాపు 40 మంది విద్యార్థులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని దాసోజు శ్రవణ్ తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో మానసిక క్షోభ అనుభవించారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బండి సంజయ్ మాట్లాడారని ధ్వజమెత్తారు. జంతర్‌మంతర్‌లో విద్యార్థులు లేవనెత్తే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ అన్నాడని తెలిపారు. ఢిల్లీలో దీక్ష, హైదరాబాద్‌లో విద్యార్థుల ఆక్రోశం నీట్ పేపర్ లీక్‌పైనే కాదు.. ఏళ్ల తరబడి అణచివేతపై పాలకులను నిలదీస్తున్నట్లుగా అర్థమవుతోందని అన్నారు. పాలనలో ఉన్న లోపాలను విద్యార్థులు ఎత్తిచూపినట్లు తెలుస్తోందని చెప్పారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బండి సంజయ్ తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. విద్యార్థులకు వారు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను..

నిర్ణయించుకున్నా అంటూ సిద్ధరామయ్య ప్రకటించారు. ఇదే అంశంపై తన సోషల్ మీడియా వేదిక ద్వారా వెల్లడించారు. ప్రస్తుతం ఆయన వయసు 79. ఇంతకాలం కాంగ్రెస్ తరపున సీఎంగా కొనసాగిన సిద్ధరామయ్య ఇటీవలే తన పదవికి రాజీనామా చేశారు.

## ఎంపీ జం ఎమ్మెల్యే..

### చామల అనుచరుడిపై మందుల సామేల్ వర్గం హత్యాయత్నం..!




**హైదరాబాద్, జూలై 26 :** తెలంగాణ కాంగ్రెస్‌లో నేతల మధ్య వర్గపోరు ముదురుతోంది. ఈసారి ఏకంగా ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యేగా మారింది పరిస్థితి. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే మందుల సామేల్ మధ్య వివాదం మరింత తీవ్రమైంది. తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో ప్రెస్‌మీట్ నిర్వహిస్తుండగా ఎంపీ చామల అనుచరుడు పత్రపాటి యుగంధర్‌పై మందుల సామేల్ అనుచరులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. యుగంధర్‌ను చుట్టుముట్టి పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. అప్రమత్తమైన పోలీసులు మందుల సామేల్ అనుచరులను చెదరగొ ట్టారు.తుంగతుర్తి వివాదంపై ఇటీవలే ఇరువర్గాల ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ మధ్య నెలకొన్న విభేదాలను చక్కబెట్టే ప్రయత్నం చేసింది కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ. జగ్గారెడ్డి స్వయంగా ఇరువురితో, ఇతర నాయకులతో మాట్లాడి సయోధ్యకు యత్నించారు. అయినా సరే మందుల సామేల్ అవేవీ లెక్కచేయలేదు. కోమటిరెడ్డి సోదరులపై, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిపై, మాజీ మంత్రి దామోదర్ రెడ్డి కుమారుడిపై ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు చేశారు. 'ఈ నియోజకవర్గం నాది, ఎవరూ అడుగుపెట్టేందుకు అధికారం లేదు. ఎస్సీ నియోజకవర్గంలో మీ పెత్తనం ఏంటీ?' అని కోమటిరెడ్డి బ్రదర్స్, ఇతరులకు సామేల్ గట్టిగానే హెచ్చరికలు చేశారు. వర్గపోరు కొనసాగుతుండగానే.. ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి అనుచరుడిపై సామేల్ అనుచరులు దాడి చేయడం కాంగ్రెస్‌లో 'ఎవరికి వారే లీడర్' అనే పద్ధతికి అద్దం పడుతోంది.

# తెలంగాణాలో పల్లె పల్లెకూ తీపికబురు..

- ఆగస్ట్ లో ఆ పథకానికి శ్రీకారం!
- గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి దోహదం
- ఆగస్ట్ 15 నాటికి నిర్మాణ సంస్థలతో ఒప్పందాలు
- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా త్వరలోనే లాంఛనంగా పనులు
- హ్యామ్ రోడ్ల కోసం పనులు .. టెండర్లు పూర్తి



**హైదరాబాద్, జూలై 26:** తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాల ప్రగతి కోసం రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని భావిస్తోంది. దీనికి సంబంధించి తెలంగాణ గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ప్లాన్ రెడీ చేసి, త్వరలో ఈ ప్లాన్ ను అమలు చేయనుంది. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణాన్ని చేపడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 6,703 గ్రామాలను కలుపుతూ 18472 కిలోమీటర్ల రహదారులను నిర్మాణం చేయనుంది. మొదటి దశలో 2,678 గ్రామాల్లో, 7,450 కిలోమీటర్ల పనులకు టెండర్లు పూర్తయ్యాయి. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గంలో ఆగస్టు రెండవ వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ పనులు లాంఛనంగా ప్రారంభం కానున్నాయి. ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో రవాణా సౌకర్యం లేని 179 మారుమూల గ్రామాలకు 934 కిలోమీటర్ల మేర కొత్త రోడ్లను వేయడానికి నిర్ణయించారు. గిరిజన మారుమూల ప్రాంతాలను ఇవి ప్రధాన రహదారులతో కలుపుతాయి. పంచాయతీరాజ్ శాఖ ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల కోసం రిజర్వ్ బ్యాంక్ అనుమతిని కోరింది. ఈ నెలాఖరు నాటికి దీనికి ఆమోదం రాగానే ఆగస్టు 15వ తేదీ నాటికి నిర్మాణ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పనులు వేగంగా సాగనున్నాయి. ఈ రోడ్లు అందుబాటులోకి వస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని భావిస్తున్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు లభిస్తాయని, తద్వారా ప్రాంత అభివృద్ధికి కూడా ఆస్కారం ఉంటుందని భావిస్తున్నారు. మండల, జిల్లా కేంద్రాలను కలుపుతూ డబల్ రోడ్లు వేసిన తర్వాత, ఇప్పుడు గ్రామస్థాయి రోడ్ల పైన కూడా దృష్టి పెట్టిన తెలంగాణ సర్కార్ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి దోహదం చేయనుంది. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణం ఒక శుభవార్త.


# తెలంగాణాలో మూడురోజుల పాటు వర్షాలు..

- నేడు ఈ జిల్లాలలో వరుణ కటాక్షం!
- నేడు హైదరాబాద్.. జిల్లాలలో వర్షాలు
- అన్ని జిల్లాలలో బలమైన ఉపరితల ఈదురుగాలులు
- రైతులకు సూచన



**హైదరాబాద్, జూలై 26:** తెలంగాణ రాష్ట్రంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో వాతావరణ పరిస్థితి పైన తాజాగా లేటెస్ట్ అప్డేట్ ఇచ్చింది. ఉత్తర ఈశాన్య జిల్లాలలో నేడు తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. నేడు తెలంగాణ రాష్ట్రంలోని ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో కొన్నిచోట్ల వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. పశ్చిమ తెలంగాణలో మెదక్, సంగారెడ్డి, వికారాబాద్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.తూర్పు మరియు ఇతర ప్రాంతాలలో వరంగల్, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చ రికలు జారీ చేసింది.హైదరాబాద్ నగరవ్యాప్తంగా నేడు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని కొన్నిచోట్ల తెలుగు పాట జల్లులు లేదా మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నేడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. జులై 26వ తేదీ నుండి 31వ తేదీ వరకు కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇదిలా ఉంటే గత కొన్ని రోజులుగా రాష్ట్రంలోని అనేక జిల్లాలలో వర్షాలు కురుస్తున్నాయి. అయినప్పటికీ సాధారణ స్థాయితో పోలిస్తే లోటు వర్షపాతమే నమోదవుతున్న పరిస్థితి ఉంది. ఋతుపవనాలు విస్తరించి ఉన్నప్పటికీ, ఎల్ నినో పరిస్థితుల కారణంగా వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం లేదు. కనుక నీటి నిల్వల విషయంలో, నీటి వినియోగం విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని రైతులు వర్షాధార పంటలను వేయొద్దని, ప్రత్యామ్నాయ పంటల సాగు పైన దృష్టి సారించాలని వాతావరణ శాఖ వెల్లడించింది.

# సౌదీపై హౌతీల దాడులు



**న్యూఢిల్లీ, జూలై 26 :** అమెరికా–ఇరాన్ మధ్య భీకర యుద్ధం జరుగుతున్న సమయంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఎర్ర సముద్ర తీరంలోని హోడెయిడా నగరంపై సౌదీ వైమానిక దాడులు చేసింది. దీంతో యెమెన్‌లోని తిరుగు బాటు దారులు హౌతీలు సౌదీపై డ్రోన్లు, క్షిపణులతో దాడులకు పాల్పడ్డారు.యాన్బు, జిజాన్‌లోని అతిపెద్ద అరమ్‌కో చమురు స్థావరాలపై దాడులు జరిపనట్టు హౌతీలు ప్రకటించారు. ఎర్ర సముద్రంలో దిగ్బంధనాన్ని ప్రకటించారు. యెమెన్‌పై దిగ్బంధనం ఎత్తేసే వరకు ఎర్ర సముద్రంలో నౌకలను అడ్డుకుంటామని తెలిపారు.

# రామగుండం బల్దియాలో అక్రమాలను అరికట్టాలి

- సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య

**హైదరాబాద్, జూలై 26 :** రామగుండం బల్దియాలో అక్రమాలను అరికట్టడంతోపాటు అవినీతి అధికారులు, కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను కోరారు. ఈ మేరకు స్థానిక భాస్కర్ రావు భవన్‌లో ఆదివారం సీపీఐ నగర ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మార్కపురి సూర్య మాట్లాడుతూ.. రామగుండం కార్పొరేషన్ లోని కీలక శాఖల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. మాస్టర్ ప్లాన్ ప్రకటించి అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకొని కూల్చివేతలు జరపాలని సూచించారు. ఇటీవల నగరంలోని పలు డివిజన్లలో సుమారు రూ.13 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని.. వీటిలో కాంట్రాక్టర్లు అవకతవకలకు పాల్పడకుండా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అలాగే కార్పొరేషన్‌లోని 60 డివిజన్లలోఖాళీగా ఉన్న144 పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో కీలకమైన పోస్టులు ఖాళీగా ఉండటం విచారకరమన్నారు. రామగుండంకు బదిలీపై రావడానికే అధికారులు భయపడే పరిస్థితి నెలకొందన్నారు. ఆరుగురు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లకు కేవలం ఇద్దరే ఉండటం శోచనీయమన్నారు.టౌన్ ప్లానింగ్‌లో అవినీతిని పారద్రోలాలని కోరారు. విజిలెన్స్ విచారణను సన్నగిల్లించే ప్రయత్నం జరుగుతుందన్నారు. అన్ని పార్టీల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని మాస్టర్ ప్లాన్ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోసిక మోహన్, నగర కార్యవర్గ సభ్యులు మడికొండ ఓదెమ్మ, ఆసాల రమ, శనిగరపు చంద్రశేఖర్, సిరిసిల్ల మల్లేష్, రాణవేణి సుధీర్, ఆశాల నవీన్, సాదుల శివ, అబ్దుల్ కరీం, తిరుమల, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమను రత్నాలసీమగా మారుస్తా



- వేదవతిని త్వరగా పూర్తి చేసి లిఫ్ట్ చేస్తాం
- జొన్నగిరిని స్వర్ణగిరిగా మారుస్తాం
- రాయలసీమ స్టీల్స్‌తో యువతకు ఉపాధి కల్పిస్తా
- కర్నూలు పర్యటనలో సిఎం చంద్రబాబు హామీ

**కర్నూలు ,జులై 25 :** కర్నూలు జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, రాయలసీమ ప్రగతి, తీవ్రమవుతున్న ఆర్థిక, నీటి సంక్షోభాలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. రాయలసీమను 'రత్నాల సీమ'గా మారుస్తామని సీఎం ఆకాంక్షించారు. వేదవతి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి, హంద్రీ–నీవా నుంచి నీటిని లిఫ్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. జొన్నగిరి గోల్డ్ మైనింగ్‌తో దానికి 'స్వర్ణగిరి'గా పేరు మార్చామని, 2028 మార్చి నాటికి 'రాయలసీమ స్టీల్స్' అందుబాటులోకి తెస్తామని తెలిపారు. పుట్టపర్తి కేంద్రంగా యుద్ధ విమానాల తయారీ పరిశ్రమను తీసుకొస్తామని, అలాగే రాయలసీమను రూ. లక్ష కోట్లతో 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఈ ఏడాది పోలవరం పనులు పూర్తి చేసి, 2027 మార్చి నాటికి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. ఇరాన్ యుద్ధ పరిణామాల వల్ల గ్యాస్, పెట్రోల్ సరఫరా తగ్గి రాష్ట్ర ఆదాయం పడిపోయిందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం 51 శాతం తగ్గడం వల్ల భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయని చెప్పారు. అందుకే ఈ ఏడాది రైతులు వరి పంట వేయవద్దని, ఆరుతడి పంటలు, పండ్లు, కూరగాయలు సాగు చేయాలని సూచించారు. అలూరు నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడిపై సీఎం ఆరా తీశారు. నీటి సరఫరాలో ఆలూరు 18 శాతం వెనుకబడి ఉందని సభలో ప్రజలు చెప్పగా, సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. అలాగే.. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని కోరారు. దంపతులు కూడా ఒకే ఇంట్లో ఉంటూ ఫోన్లకే పరిమితం కావడం సరికాదన్నారు. ‹రాష్ట్రంలో ఒక దౌర్భాగ్య పార్టీ ఉందంటూ సీఎం మండిపడ్డారు. బాబాయిని గొడ్డలితో చంపి, ఆ నిందను తనపై వేసేందుకు ప్రయత్నించారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో ఎవరు గొడ్డలి ఎత్తినా ఆ చేయి లేకుండా పోతుందని హెచ్చరించారు. తాము అందించే 'సూపర్ సిక్స్' పథకాలతో అభివృద్ధి, సంక్షేమం సమతులంగా ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

## ఇంద్రకీలాద్రిపై ఆషాఢ ఉత్సవాలు

**విజయవాడ,జులై25 :** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో ఆషాడ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న శాకంబరీ ఉత్సవాలకు దేవస్థానం సన్నాహాలను ముమ్మరం చేసింది. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీ శాకంబరీదేవి అలంకారంలో ఆకు కూరలు, కూరగాయలు, పండ్లతో అలంకరించబడిన ప్రకృతి మాత స్వరూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు బడేటి ధర్మారావు ఆధ్వర్యంలో తొలి విడతగా7టన్నుల కూరగాయలను దేవస్థానానికి అందజేశారు. శనివారం సాయంత్రం మహామండపం ఆరో అంతస్తులో దేవస్థానం చైర్మ న్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్య నిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ అమ్మవారికి కూరగాయలను సమర్పించగా, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాకంబరీ అలంకరణ కోసం కూరగాయల దండల తయారీని ప్రారంభించారు. ఈవో వి.కె.శీనానాయక్ మాట్లాడుతూ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తాడేపల్లిగూడెం, తణుకు, మడికి, సిద్ధాంతం, ఏలూరుప్రాంతాలతో పాటు గుంటూరుజిల్లా జాగర్లమూడి, తెనాలి, యడ్లపల్లి,నారాకోడూరు,గుంటూరు, కృష్ణా జిల్లా నూజివీడు, చినఓగిరాల, పెదఓగిరాల ప్రాంతాల రైతుల నుంచి వివిధ రకాల కూరగాయలను సేకరించి బస్సుల ద్వారా ఇంద్రకీలాద్రికి తరలిస్తున్నట్లు తెలిపారు.

# సంపాదకీయం

# కాక్రోచ్ ఉద్యమాన్ని హైజాక్ చేసే యత్నాలు ?

విద్యార్థుల ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు కాంగ్రెస్, ఆప్ పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. తమ కంట్రోల్‌లో తీసుకునేందుకు రాహుల్ నానా యాతన పడుతున్నారు. తానే ముందుండి ఇదంతా నడిపిస్తున్న ట్లుగా వ్యవహరించారు. ప్రధాని మోడీ నివాసం ముందు ఆకస్మిక ధర్నాకు దిగడం, రాష్ట్రాల్లో మద్దతుగా కాంగ్రెస్ ఆందోళనలకు దిగడం చూస్తుంటే కాంగ్రెస్ రాజకీయ లబ్ధి పొందేందుకు ఎత్తులు వేస్తోందని అర్థం అవుతోంది. అభిజిత్ దీప్కే వెనకాల కాంగ్రెస్ ఉందా లేదా అన్నది తెలియదు. ఒకవేళ ఉంటే విద్యార్థులు వెంటనే కాంగ్రెస్‌ను పక్కన పెట్టాలి. ఎందుకంటే విద్యార్థుల ఉద్యమం పక్కదారి పట్టే అవకాశం ఉంది. విద్యార్థులు ఉద్యమించడం ద్వారా ఒక్క నీట్ సమస్య కాకుండా అనేక సమస్యలు, ముఖ్యంగా దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే ఛాన్స్ ఉంటుంది. కాంగ్రెస్‌ను దగ్గరకు రానీయనంతవరకు అభిజిత్ దీప్కే ఉద్యమానికి ఢోకా ఉండదు. ఎందుకంటే నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. యువత కూడా జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనకు రావడంలో నిజాయితీ ఉంది. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పోలీసులు, నిరసనకారులకు మధ్య హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో రెండు వర్గాలు గాయపడ్డాయి. ఈ ఉద్యమంలో ప్రధాన ఎజెండా పేపర్ లీకుల నుంచి విషయం తప్పుదారి పడుతున్నట్లు కనిపిస్తోంది. ఉద్యమంలో యువత పాల్గొంటున్నప్పటికీ, వారితో పాటు కొన్ని మత శక్తులు కూడా ప్రవేశించాయని స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా జంతర్ మంతర్ వద్ద అసలైన ఎజెండా పక్కకు పోయి రామమందిరం, హిందూ దేవతల్ని తిట్టడం, జర్నలిస్టులపై దాడులు, భారత సైన్యంపై విద్వేష వ్యాఖ్యలు, జిహాద్ నినాదాలు వినిపించడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని శక్తులు ఈ ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థి ఉద్యమం మత ఉద్యమంగా మారుతుందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు, నిహాంగ్ సిక్కులు కత్తులు, కిర్పాన్లు, ఈటెలతో కనిపించడం మరింత వివాదాస్పదమైంది. వీటిని ఊపుతూ ప్రదర్శనలు చేయడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. పలువురు మేధావులు కూడా ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమన్వయం లేకపోతే ప్రశాంతమైన ఉద్యమం బయటి శక్తుల ప్రయోజనాలకు ఉపయోగించే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు. బుధవారం రాత్రి యూట్యూబర్లపై దాడి, నిరసనకారులు-నిహాంగ్ సిక్కులకు మధ్య ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుతుండటం మహిళల భద్రతకు ప్రమాదంగా మారింది. ఒక యువతిపై లైంగిక వేధింపులకు ప్రయత్నిస్తున్న వీడియో బయటకు రావడం మరింత ఆందోళనకు గురిచేసింది. పేపర్ లీక్ అంశాలతో పాటు మతం, ప్రాంతీయ ఉద్యమాలు, రాజకీయ అంశాలు ప్రస్తావనకు వస్తుండటం చూస్తే ఉద్యమం అసలు లక్ష్యం బలహీనపడుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై గత కొద్ది రోజులుగా జంతర్‌మంతర్ దగ్గర విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. చలో పార్లమెంట్ ముట్టడి సందర్భంగా విద్యార్థులపై పోలీసులు అమానుషంగా లాఠీఛార్జ్ నిర్వహించారు. దీంతో చాలా మంది బాలికలకు తీవ్ర గాయాలయ్యాయి. పలువురి పరిస్థితి విషమంగా కూడా మారింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. దీంతో దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థులకు మద్దతు లభించింది. సినీ, క్రికెటర్లు, విపక్ష రాజకీయ నాయకుల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. ఈ క్రమంలో తాజాగా జంతర్‌మంతర్ దగ్గర కిలోమీటర్ దూరంలో ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మరోవైపు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు సంతాపంగా గాంధీ స్మృతి వనం దగ్గర నివాళులర్పించారు. విద్యార్థులకు ఇండియా కూటమి అండగా ఉంటుందని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇదంతా కూడా కాంగ్రెస్ ఉద్యమాన్ని తన గుప్పిట్లోకి తీసుకుని పోయే యత్నంగా గోచరిస్తున్నది. గత రెండు నెలలుగా పెద్దగా పట్టించుకోని కాంగ్రెస్ అకస్మాత్తుగా ఇప్పుడు ముందువరసలోకి రావడానికి యత్నిస్తోంది. బిజెపి కూడా ఇంతకాలం తాత్సారం చేస్తూ వచ్చింది. పరీక్షలో అక్రమాల ఆరోపణలు, పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక పరిపాలనా మార్పులు చేపట్టింది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న వినీత్ జోషిని ఆ పదవి నుంచి తప్పిస్తూ, ఆయన స్థానంలో నరేశ్ పాల్ గంగ్వార్ ను నియమించింది. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి కేంద్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందిన గంగ్వార్, కేంద్రంతో పాటు రాజస్థాన్ ప్రభుత్వంలో కూడా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా సేవలందించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీక్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సజిపి ప్రధాన డిమాండ్‌గా పెట్టుకుంది. కానీ కేంద్రం ఈ డిమాండ్‌ను పక్కన పెట్టింది.

ప్రముఖ సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఈ నిరసనలో పాల్గొని నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. దీంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. జూలై 20న 'చలో పార్లమెంట్' కార్యక్రమానికి పిలుపునివ్వగా, నిరసనకారులు, ఢిల్లీ పోలీసుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల అనంతరం కేంద్ర ప్రభుత్వం పలుమార్లు సిజిపి ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించింది. అయితే, కేంద్ర మంత్రులే జంతర్ మంతర్ లేదా నిరసన ప్రాంతానికి సమీపంలోని వేదికకు రావాలని కాక్రోచ్ పార్టీ స్పష్టం చేసింది. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వరుస చర్యలు తీసుకుంటుండగా, రానున్న రోజుల్లో ఈ అంశంపై మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఉద్యమం పక్కదాని పట్టకుండా, రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా చూసుకోవాల్సన బాధ్యత అభిజిత్ దీప్కేతో పాటు, ఆయన అనుచరులపై ఉంది.

# విమర్శలపై సోనమ్ వాంగ్‌చుక్ ఘాటు స్పందన



న్యూఢిల్లీ,జూలై26 :దాదాపు 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఇటీవల కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో దీక్షను విరమించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ నెరవేరకపోయినా తాను ఎందుకు నిరాహార దీక్ష విరమించాల్సి వచ్చిందో తాజాగా సోనమ్ వివరించారు. ప్రభుత్వంతో ఎలాంటి రహస్య ఒప్పందమూ చేసుకోలేదని, నిరసనకారుల భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై హింసాత్మక చర్యలు జరిగే అవకాశం ఉందన్న ఆందోళన తనకు కలిగిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. గతంలో లడఖ్‌లో జరిగిన పోలీసు చర్యల మాదిరిగా పరిస్థితి మారకూడదనే ఉద్దేశంతో ఉపవాసాన్ని ముగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం నుంచి కొన్ని అంశాలపై లిఖితపూర్వక హామీ లభించిందని ఆయన తెలిపారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన వారిపై ప్రతీకార చర్యలు ఉండవని, వారి సమస్యలపై చర్చ కొనసాగుతుందని ప్రభుత్వం హామీ ఇచ్చిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు (ఔఇఇ÷ ÷ఔసనీబిఙబి). అయితే, దీక్ష విరమించడం అంటే ఉద్యమం ముగిసినట్లు కాదని స్పష్టం చేశారు. కాగా, జంతర్ మంతర్‌లో నిరసన చేపడుతున్న సీజేపీ నేతలు మాత్రం తమ ఆందోళన కొనసాగుతుందని ప్రకటించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని వారు వెల్లడించారు. పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజులు చేసిన నిరాహార దీక్షను కేంద్రమంత్రుల సమక్షంలో విరమించిన నేపథ్యంలో.. డీల్ కుదిరిందంటూ ఆయనపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. వీటిని ఆయన తీవ్రంగా ఖండించారు. 'నేను చేసిన దీక్ష ఎంత స్వచ్ఛమైందో నిరూపించుకునేందుకు సర్టిఫికెట్ కావాలా.. అని ప్రశ్నించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. అలాగే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుండానే దీక్ష విరమించడంపైనా స్పందించారు. దీక్ష విరమించినప్పటి నుంచి చాలా మంది నాకు ఫోన్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు చూపిస్తూ.. మీపై పలు సందేహాలు వస్తున్నాయని చెప్తున్నారు. కేంద్రమంత్రుల సమక్షంలోనే ఎందుకు దీక్ష విరమించారు..? ఏం ఒప్పందం జరిగింది..? అని అడుగుతున్నారు. నేను నిరాహార దీక్ష ఎంత పవిత్రంగా చేశానో ఎవరి నుంచైనా సర్టిఫికెట్ తీసుకోవాలా..? ఇలా బేరాలు కుదుర్చుకోవాల్సి వస్తే.. ఎవరైనా 26 రోజులు ఆకలితో ఉంటారా..? దిల్లీ ఎండలో రోడ్డు పక్కన కూర్చునే బదులు.. ఏసీ గదిలో కూర్చొని డీల్ చేసుకోలేనా' అని తనపై వస్తోన్న విమర్శలకు వాంగ్‌చుక్ కౌంటర్ ఇచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనేది కచ్చితంగా ముఖ్యమైన విషయం. అయితే నిరసనకారులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకుండా నిరోధించడమే నాకు ప్రాధాన్య అంశంగా అనిపించింది. అందుకే కేంద్రంతో చర్చల సమయంలో రాజీనామా గురించి నేను డిమాండ్ చేయలేదు. రాజీనామాను వ్యక్తిగతంగా ప్రస్తావించాల్సిన అవసరం ఉందని అనుకోవడం లేదు. దీన్ని కేంద్రం పెద్ద విషయంగా భావించడం లేదు. రాజీనామా అంశాన్ని నిరాకరించడం వల్ల అపారనష్టాన్ని చవిచూస్తోంది. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠ దిగజారుతోంది. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రాజీనామా విషయంలో ఎటూ తేల్చకుండా కేంద్రం ఎక్కువ కాలం నాన్చలేదు. కొన్నిరోజుల్లో మంత్రి రాజీనామా సమర్పిస్తారని నాకు తెలుసు. అందుకే ఆ విషయంలో నేను మరీ ఎక్కువ ఒత్తిడి చేయలేదు' అని వాంగ్‌చుక్ వివరించారు. దీక్ష కొనసాగిస్తున్న సమయంలో.. దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు సోనమ్ వాంగ్‌చుక్‌ను జంతర్‌మంతర్ నుంచి సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి పరిస్థితులపై తాజాగా వాంగ్‌చుక్ స్పందించారు. ఆ ఆసుపత్రి జైలులా అనిపించింది. ఒక ఖైదీ కంటే తీవ్రంగా పరిగణించారు. చుట్టూ ఆంక్షలే. నేను నా గది నుంచి కూడా రాలేకపోయా. ఎవరిని కలవడానికి అనుమతించలేదు. ముగ్గురు బంధువులను మాత్రం నావద్దకు రానిచ్చారు అంటూ వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఆయన భార్య గీతాంజలి దిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయడంతో.. అక్కడి నుంచి మేదాంత ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే.

# అనారోగ్యానికి గురయిన అభిజిత్ దీప్కే



- **టైఫాయిడ్ వచ్చిందని స్వయంగా వెల్లడి**

న్యూఢిల్లీ,జూలై26 : కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అనారోగ్యానికి గురయ్యారు. నీట్ పేపర్ లీక్‌పై నెల రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టిన ఆయనకు టైఫాయిడ్ వచ్చింది. తనకు టైఫాయిడ్ వచ్చిన విషయాన్ని సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా అభిజీత్ దీప్కే వెల్లడించారు. తనకు టైఫాయిడ్ వచ్చిందని, చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల వైద్య పరీక్షలు చేయించగా వ్యాధి నిర్ధారణ అయినట్లు చెప్పారు. ప్రస్తుతం రోజుకు రెండుసార్లు ఇంట్రావీనస్ చికిత్స తీసుకుంటున్నట్లు దీప్కే పేర్కొన్నారు. తాను అనారోగ్యానికి గురైనా విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం కోరుతూ చేపట్టిన నిరసన దీక్ష మాత్రం కొనసాగుతుందని చెప్పారు. అలాగే, నీట్ పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి ఒదేనని అభిజీత్ తన వీడియో సందేశంలో తేల్చి చెప్పారు. మరో వైపు, దీప్కేతో పాటు పలువురు సీజేపీ మద్దతుదారులు, కార్యకర్తలు కూడా అనారోగ్యానికి గురైనట్లు తెలుస్తోంది. 'అందరికీ నమస్కారం. కొన్ని రోజులుగా నా ఆరోగ్యం బాగోలేదని మీ అందరికీ తెలుసు. అందుకే రక్త పరీక్షలు చేయించాను.

రిపోర్టుల్లో టైఫాయిడ్ అని నిర్ధారణ అయింది. చికిత్స కొనసాగుతోంది. నాకు ప్రతి ఉదయం, సాయంత్రం ఐవీ డ్రిప్స్ పెడుతున్నారు. దేశవ్యాప్తంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బొద్దింకలందరికీ నేను నిజంగా ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నా. మీ వల్లే ఈ ఉద్యమం ఇంత విజయవంతమైంది.మీ అందరికీ చాలా ధన్యవాదాలు. ఈ ఉద్యమాన్ని ఇంత పెద్ద విజయంగా మార్చినందుకు మీ అందరికీ అభినందనలు. నీట్ పేపర్ లీక్ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ చేపట్టిన ఉద్యమం కొనసాగుతుంది'నిఅభిజీత్ దీప్కేస్పష్టం చేశారు.

# ధర్మేంద్ర ఆదర్శంగా..లోకేశ్ రాజీనామా చేయాలి

- **డిఎస్సీలో అక్రమాలకు బాధ్యత వహించాలి**
- **జక్కంపూడి రాజా డిమాండ్**

విజయవాడ,జులై 25 : ఏపీలో డీఎస్సీలో జరిగిన అక్రమాలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించింది. లోకేష్‌పై వస్తున్న ఆరోపణలకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, ఇప్పటివరకూ డీఎస్సీలో అక్రమాలపై చంద్రబాబు, లోకేష్‌లు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించింది. ఆ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. డీఎస్సీలో అక్రమాలకు బాధ్యత వహించాల్సిన నారా లోకేష్ మంత్రి పదవిలో కొనసాగడం సరికాదని, రాజీనామా చేసి విచారణకు సహకరించాలని సూచించింది. విచారణ నుంచి తప్పించుకోవడం అనుమానాలకు తావిస్తోందని, టీచర్ పోస్టుల కోసం బేరసారాల వీడియోలు బయటకొచ్చినా నామమాత్రపు కేసులతో విచారణను నీరుగార్చారని వైఎస్సార్‌సీపీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉందని, ఇందులో నిజాలు నిగ్గు తేల్చే వరకూ ప్రజా ఉద్యమం కొనసాగిస్తామని వైఎస్సార్‌సీపీ హెచ్చరించింది. నీట్ పేపర్ లీక్ అంశానికి సంబంధించి సీజేపీ ఆందోళనలతో కేంద్ర విద్యాశాఖ పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని, ఆయన్ని అనుసరిస్తూ ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా డిమాండ్ చేశారు. ఏపీ డీఎస్సీలో అక్రమాలు జరిగిన విషయం అందరికి తెలిసిన విషయమేనని, దానికి నారా లోకేష్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్నారు. జాతీయ నేత ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆదర్శంగా తీసుకుని నారా లోకేష్ కూడా రాజీనామా చేయాలన్నారు. కేంద్రంలో టీడీపీ భాగస్వామ్య పార్టీ కాబట్టి వారిని అనుసరిస్తూ లోకేష్ రాజీనామా చేయాలన్నారు.



డీఎస్సీలో జరిగిన తప్పిదాలకు బాధ్యత వహిస్తూ తక్షణమే లోకేష్ రాజీనామా చేయాలని, ఆలా చేయకపోతే యువత ఆగ్రహానికి లోకేష్ గురి కావాల్సి వస్తుందన్నారు.

# నీట్ రద్దుతో విద్యార్థుల్లో పెరిగిన పట్టుదల

- **మరింత మెరుగైన ప్రతిభ కోసం కష్టపడ్డారు**
- **ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్య**




న్యూఢిల్లీ,జూలై26 : దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్షల పేపర్ లీకేజీల వివాదంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భిన్నంగా స్పందించారు. పేపర్ లీక్‌లు జరిగినప్పుడు మొదట్లో విద్యార్థులు తీవ్రంగా బాధపడినప్పటికీ, ఆ తర్వాత ఆ సవాలును స్వీకరించి మరింత బాగా చదివి ప్రతిభను మెరుగుపరుచుకున్నారని ఆమె తెలిపారు. ముందు బాధనిపించింది.. తర్వాత దాన్నే అవకాశంగా మలచుకుని మెరుగ్గా రాశామని పలువురు విద్యార్థులు చెబుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలపై ఓ వార్తా సంస్థకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. పరీక్షల పవిత్రతను దెబ్బతీసిన వారిపై సత్వర చర్యలు తీసుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా స్పందించారని మంత్రి చెప్పారు. నిందితుల అరెస్టులు, సకాలంలో మళ్లీ పరీక్షలు నిర్వహించడం, ఫలితాలను విడుదల చేయడం ద్వారా విద్యార్థులు తమ ఉన్నత విద్య వైపు అడుగులు వేయగలుగుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ సున్నితమైన అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ చర్యల వల్ల ప్రతిపక్షాల విమర్శలకు విలువే లేకుండా పోయింది. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు, పేపర్లను అమ్మిన, కొనుగోలు చేసిన నేరస్తుల అరెస్టులు శరవేగంగా జరుగుతున్నాయి' అని ఆమె స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే ఎన్టీఏకు చెందిన 47 మంది ఉద్యోగులను ప్రభుత్వం తొలగించిందని ఆమె పేర్కొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో మారుతున్న పరిణామాలు

- **ఢిల్లీ నుంచి మహా సిఎం ఫడ్నవీస్‌కు పిలుపు**
- **మంత్రివర్గంలో మార్పులపై ఊహాగానాలు**

న్యూఢిల్లీ,జులై 25 : మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో న్యూఢిల్లీలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఢిల్లీ రావాలని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌కు అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం షిండేకు కూడా ఢిల్లీ పెద్దల నుంచి పిలుపు వచ్చింది. కీలక నేతలకు హైకమాండ్ నుంచి పిలుపు రావటంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తరువాత



న్యూఢిల్లీలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఢిల్లీకి రావాలని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌కు అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం షిండేకు కూడా ఢిల్లీ పెద్దల నుంచి పిలుపు వచ్చింది. కీలక నేతలకు హైకమాండ్ పిలుపుతో రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది. కేంద్రం భారీ మార్పులకు సిద్ధం అవుతోందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ దిశగా శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర లో సీఎం మార్పు జరుగబోతోందని అన్నారు. ఫడణవీస్‌కు కేంద్ర విద్యాశాఖను ఇవ్వబోతున్నారని చెప్పారు. కేంద్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ కొంత కాలంగా వాయిదా పడుతున్న విషయం తెలిసిందే. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే ఇందుకు సంబంధించిన కసరత్తు పూర్తి చేయాలని కేంద్రం భావించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ప్రధాని విదేశీ పర్యటనల కారణంగా ఈ పక్రియ కొంతకాలం పాటు వాయిదా పడినట్టు సమాచారం. ఇక పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రధాన్ సహా ఇతర మంత్రులు తప్పుకునే అవకాశం ఉన్నట్టు వార్తలు వచ్చాయి. ఈలోపు విద్యార్థుల నిరసనలు మిన్నంటాయి. విపక్షలా నిరసనల నేపథ్యంలో గత కొన్ని రోజులుగా పార్లమెంటు కూడా ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదా పడుతోంది. తాజాగా విద్యాశాఖ మంత్రి తప్పుకోవడంతో ఆ శాఖ ఎవరికి కేటాయిస్తారన్న ఉత్కంఠ మొదలైంది. ఇతర ప్రభుత్వ శాఖల విషయంలో ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటుందా అన్న చర్చ జరుగుతోంది. నిన్న రాత్రి కేంద్రం 12 శాఖల సెక్రటరీలకు స్థాన చలనం కలిగించింది. వారిలో విద్యాశాఖ సెక్రటరీ కూడా ఉన్నారు. దీంతో, మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణపై కేంద్రం పూర్తిస్థాయి దృష్టి పెట్టనుందా? అన్న చర్చ జరుగుతోంది.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

# సక్సెస్ టాక్‌లో చెన్నై లవ్ స్టోరీ




టాలీవుడ్‌లో తాజాగా విడుదలైన ప్రేమకథా చిత్రాల్లో 'చెన్నై లవ్ స్టోరీ' ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, నటి శ్రీ గౌరీ ప్రియా జంటగా నటించిన ఈ చిత్రానికి దర్శకుడు రవి నంబూరి దర్శకత్వం వహించారు. జాతీయ అవార్డు గ్రహీత సాయి రాజేష్ అందించిన కథతో తెరకెక్కిన ఈ సినిమా విడుదలకు ముందే మంచి అంచనాలు ఏర్పరుచుకోగా, ప్రీమియర్ షోల నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. ప్రేమ, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ను అందుకుంది. ముఖ్యంగా కిరణ్ అబ్బవరం నటన, శ్రీ గౌరీ ప్రియా సహజమైన అభినయం, భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని సినీ అభిమానులు సోషల్ మీడియాలో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో విడుదలైన మొదటి రోజే 1.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడుపోవడం విశేషంగా మారింది. విడుదల రోజునే ఇంత భారీ స్థాయిలో టికెట్ సేల్స్ నమోదు కావడం సినిమా క్రేజ్‌ను ప్రతిబింబిస్తోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన పాటలు, నేపథ్య సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. భావోద్వేగ సన్నివేశాలను మరింత బలంగా నిలబెట్టడంలో ఆయన సంగీతం కీలక పాత్ర పోషించిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. తొలి రోజు స్పందనను బట్టి చూస్తే, 'చెన్నై లవ్ స్టోరీ' కిరణ్ అబ్బవరం కెరీర్‌లో మరో విజయవంతమైన చిత్రంగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'చెన్నై లవ్ స్టోరీ' చిత్ర బృందం నిర్వహించిన సక్సెస్ మీట్ లో సిబ్బంది మాటలు హైలైట్‌గా నిలిచాయి. హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ, నిర్మాతలు ధీరజ్ మొగిల్నేని, ఎస్‌కేఎన్ తమ అనుభవాలను పంచుకుంటూ సినిమాపై ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ మాట్లాడుతూ.. తన జీవితంలో ఇది ఎంతో ప్రత్యేకమైన విజయమని చెప్పారు. సినిమా విడుదలైనప్పటి నుంచి తన ఫోన్ నిరంతరం మోగుతూనే ఉందని, చాలామంది మీ అమ్మ ఉండి ఉంటే చాలా సంతోషించేదని చెబుతున్నారని వెల్లడించారు. అయితే తన అమ్మ ఎక్కడ ఉన్నా తన విజయాన్ని చూస్తూనే ఉంటుందని తాను నమ్ముతున్నానని ఆమె ఎమోషన్ అయ్యారు. ఒక తెలుగు అమ్మాయిగా కంటెంట్ ఉన్న పాత్రలో నటించే అవకాశం రావడం తన అదృష్టమని అన్నారు. నిర్మాత ధీరజ్ మొగిల్నేని మాట్లాడుతూ.. సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రాణం పోశాయని చెప్పారు. అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం కూడా చిత్రానికి మరో బలమైందన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అన్ని వయసుల మహిళలు సినిమాను విశేషంగా ఆదరిస్తున్నారని వెల్లడించారు. గౌరీ ప్రియ పాత్ర కోసం ప్రాణం పెట్టి నటించిందని, అందుకే ఇప్పుడు ఆమెకు అంతటి ప్రశంసలు వస్తున్నాయని చెప్పారు. హీరో కిరణ్ అబ్బవరాన్ని నిజమైన నిర్మాతల హీరోగా అభివర్ణిస్తూ, షూటింగ్ విషయంలో ఎప్పుడూ సహకరించారని వెల్లడించారు.

# మెగా 158లో డాక్టర్ భద్రం కీలక రోల్

## చిరును కలిసి కృతజ్ఞతలు తెలిపిన సోము వీర్రాజు



మెగాస్టార్ చిరంజీవి కొత్త ప్రతిభను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారనే విషయం మరోసారి చర్చనీయాంశమైంది. దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 లో ప్రముఖ హాస్యనటుడు డాక్టర్ భద్రంకు కీలక పాత్ర దక్కడం ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సందర్భంగా ఏపీ బీజేపీ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు స్వయంగా చిరంజీవిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ భద్రం తన అల్లుడు కావడంతో, ఆయనకు ఇలాంటి మంచి అవకాశం కల్పించినందుకు చిరంజీవికి వ్యక్తిగతంగా ధన్యవాదాలు తెలిపినట్లు సోము వీర్రాజు వెల్లడించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు, వివరాలను సోషల్ మీడియా ద్వారా పంచుకోవడంతో అవి ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ, కొత్త నటీనటు లకు అవకాశాలు కల్పిస్తూ వారి ప్రతిభను వెలుగులోకి తీసుకురావడంలో చిరంజీవి ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. కళాకారులను ప్రోత్సహించే ఆయన విశాల హృదయం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి?బాబీ కాంబినేషన్‌లో వస్తున్న మెగా158 పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. ఈ చిత్రంలో డాక్టర్ భద్రంకు కథలో ప్రాధాన్యం ఉన్న పాత్ర లభించినట్లు సమాచారం. కమెడియన్‌గా ఇప్పటికే మంచి గుర్తింపు సంపాదించిన భద్రం, మెగాస్టార్‌తో కలిసి నటించే అవకాశం తన కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలవనుంది. ముఖ్యంగా 'ప్రతి రోజూ పండగే' చిత్రంలో తన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న డాక్టర్ భద్రం, ఇప్పుడు చిరంజీవితో స్క్రీన్ షేర్ చేసుకోనుండటంతో ఆయన పాత్ర ఎలా ఉండబోతుందన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. మెగా158 లో చిరంజీవి మరోసారి పవర్‌ఫుల్ మాస్ అవతార్‌లో కనిపించనున్నారని, దర్శకుడు బాబీ తనదైన శైలిలో కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.

# అర్థవంతమైన పాత్రలుంటేనే చేస్తా : నిధి అగర్వాల్



సినిమాల్లో అవకాశాల కోసం తొందరపడడం లేదని నటి నిధి అగర్వాల్ అన్నారు. 'ఈశ్వరన్', 'భూమి', 'కళగ తలైవన్' తర్వాత తమిళ సినిమా చేయలేదని, సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురు చూస్తున్నానని చెప్పారు. మంచి దర్శకులతో అర్థవంతమైన పాత్రలు ఉన్న సినిమాలు చేయాలనుకుంటున్నాను. అలాంటి పాత్రలకు తమిళ ఇండస్ట్రీ సరైన చోటు. నా జీవితంలో దేనికీ నేను తొందరపడను. పెళ్లి విషయంలో కూడా అంతే. మంచి ప్రాజెక్ట్‌లు వస్తే.. సినిమాలు చేస్తాను. 'హరి హర వీరమల్లు, 'ది రాజా సాబ్' సినిమాల్లో స్టార్‌లతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రస్తుతం తెలుగు, హిందీ సినిమాలతో బిజీగా ఉన్నాను. దీంతో తమిళంలో నటించడం మిస్ అవుతున్నా. నాది చాలా సున్నితమైన మనస్తత్వం. అందుకే భావోద్వేగాలు ఎక్కువగా బయటపెట్టను. వృత్తిపరంగా బాగా కష్టపడతాను. ఇతర విషయాలకొస్తే అత్యంత సోమరిని. ప్రస్తుతం రెండు ప్రాజెక్టుల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఇంకా ఫైనల్ చేయలేదని నిధి తెలిపారు. ఇక, ప్రస్తుతం ఆమె 'మిరాయ్' పార్ట్-2, హిందీ సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఇన్‌ఫ్లుయెన్సర్'లో కనిపించనున్నారు.



# సౌండ్ ఇంజనీర్‌గా వస్తోన్న నారా రోహిత్



కథానాయకుడు నారా రోహిత్ జోరుమీదున్నారు. ఒకప్పుడు వైవిధ్యమైన కథలు, పాత్రలు ఎంచుకుని అలరించేవారు. ఆయన నుంచి సినిమా వస్తుందంటే ఏదో కొత్తదనం ఉందనే భావన ప్రేక్షకులకు కలిగేది. అయితే, కొంతకాలం విరామం తీసుకున్న నారా రోహిత్ గతేడాది 'భైరవం', 'సుందరకాండ' చిత్రాలతో మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. ఇప్పుడు మరోసారి వరుస చిత్రాలతో అలరించడానికి సిద్ధమయ్యారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమాల కబుర్లు పంచుకుంటున్నారు. రామ్ గన్నీ దర్శకత్వంలో రోహిత్ ఓ సినిమాలో నటిస్తున్నారు. దీనికి 'కపాలి' అనే టైటిల్, ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. పురాణాంశాలతో నిండిన సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఇది రూపొందుతోంది. ఇక వెంకటేశ్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం.47'లోనూ నారా రోహిత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆయన పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ లుక్‌ను కూడా చిత్ర నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ శనివారం సోషల్‌మీడియా వేదికగా పంచుకుంది. దీంతో పాటు, చినిమిల్లి మణికుమార్ దర్శకత్వంలో ఓ వైవిధ్యమైన కథలో నారా రోహిత్ మెరవనున్నారు. ఈ సినిమాకు 'సౌండ్ ఇంజనీర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. నయన్‌సారిక, నరేశ్, రోహిణి, అజయ్, వెన్నెల కిషోర్, సుదర్శన్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# హాలీవుడ్ సినిమాలకు దీటుగా 'రామాయణ'




ప్రపంచ నలుమూలలకు వెళ్తుందని ఇన్‌స్టాలో పోస్ట్

నితేశ్ తివారీ దర్శకత్వంలో భారీ హంగులతో రూపుదిద్దుకుంటున్న సినిమా 'రామాయణ'. శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. శుక్రవారం విడుదల కావాల్సిన ఈ సినిమా ట్రైలర్ చివరి నిమిషంలో వాయిదా పడింది. అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని భావించి ట్రైలర్‌ని వాయిదా వేస్తున్నాం. హాలీవుడ్ సినిమాలకు దీటుగా 'రామాయణ' ప్రపంచ నలుమూలలకు వెళ్తుందని పేర్కొంటూ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు నిర్మాత నమిత్ మల్హోత్రా. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా అమెరికాలో జరుగుతోన్న శాన్ డియాగో కామిక్-కాన్ 2026 వేడుకల్లో చిత్రబృందం పాల్గొంది.

ఈ సందర్భంగా వేడుకలో రణ్‌బీర్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో అవకాశం వచ్చినప్పుడు నాలో చాలా భయం, సందేహం ఉండేవి. 'నేను ఇది చేయగలనా, నాకు అంత సామర్థ్యం ఉందా?' అనిపించేది. కానీ ఆ సందేహం చాలా త్వరగానే కృతజ్ఞతా భావంగా మారింది. ఇదొక వరం. జీవితంలో ఒక్కసారి మాత్రమే లభించే అవకాశం. తరతరాలుగా శ్రీరాముడు ఎంతో మందికి ఆత్మ రక్షకుడిగా ఉన్నారు. ధైర్యం, కరుణ, క్షమ, ధర్మం లాంటి వాటికి ఆయన ప్రతీకగా నిలుస్తారు. అలాంటి లక్షణాలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం చాలా గొప్ప విషయం. దీనికి చాలా విశ్వాసం, నమ్మకం, నిజాయతీ అవసరమని ప్రారంభంలోనే అర్థం చేసుకున్నా. ఈ కథను ధ్యమైనంత వాస్తవికంగా చెప్పాలన్నదే మా నటీనటులు, సిబ్బందిల ఉన్నతమైన ఉద్దేశం అన్నారు. యశ్ మాట్లాడుతూ.. 'ఈ ప్రపంచంలో ఎవరూ వచ్చి 'నేను శ్రీరాముడి పాత్ర పోషించగలన'ని చెప్పలేరు. ఈ పాత్ర పోషించడం అంత సులభం కాదు. రణ్‌బీర్ గొప్పగా నటించారు. సినిమా చూసినప్పుడు అతని నిబద్ధత కనిపిస్తుంద'ని అన్నారు. రెండు భాగాలుగా విడుదల అవనున్న ఈ సినిమా మొదటి భాగం దీపావళికి థియేటర్లలోకి రానుంది.



